క్లుప్తంగా

పేద విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



వైష్ణవికి నగదు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం గన్నేవారిపల్లి కాలనీకి చెందిన పేద విద్యార్థిని వైష్ణవి చదువుకు రూ.30 వేలను రోటరీ క్లబ్ సభ్యులు వితరణ చేశారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన వైష్ణవి ఆర్జీటీ సెట్ ఎంపికై విజయవాడలో ఇంటర్ చదవనుంది. ఈనేపథ్యంలో వైష్ణవి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పుస్తకాలు , ఇతర ఖర్చుల కోసం రూ.30 వేలు నగదు అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు షాకీర్ తెలిపారు. క్లబ్ సభ్యులు బాల సుబ్రహ్మణ్యం, కోన రంగయ్య, పెద్దమద్దిలేటయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: రజాపురంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నాగరాజు అనే వ్యక్తిని గురువారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. నాగరాజు ఇంట్లో దాచిన 31 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తెలిపారు.

ఇంటి వద్దే వైద్యం



ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా 104 వాహనంతో ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నామని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యుడు అప్పయ్య తెలిపారు. గురువారం వీరారెడ్డి పల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో 104 ద్వారా 50 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ అప్పయ్య తెలిపారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్య



మాట్లాడుతున్న వంశీయాదవ్

గుంతకల్లుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు వంశీయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ముద్రించిన పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ రకాల వర్క్‌బుక్‌లను అధిక ధరలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న స్కూళ్లను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా హాస్టల్స్‌ను నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్స్‌పై చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు అనిల్, అశోక్, మణి, తిరుమలనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

తాడిపత్రి అర్బన్: చుక్కలూరు సమీపంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని సెబ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. డ్రైవర్ పాణ్యం జగదీష్‌ను అరెస్టు చేసి లారీని పోలీసులకు అప్పగించినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పశుబీమా చేయించుకున్న రైతులకు ప్రమాదవశాత్తు పశువు మృతి చెందితే వారంలోగా పరిహారం రైతు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. ఏడీ డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 30 వరకు మండల వ్యాప్తంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణకు మందులు సరఫరా చేస్తున్నామన్నారు. 65 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు మండల కేంద్రంలోని వెటర్నీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి విద్యార్థికీ బంగారు భవిష్యత్తు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి





సన్మానం పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, విద్యార్థినికి పురస్కారం అందిస్తున్న చైర్‌పర్సన్ భవాని, ఆర్డీఓ రవీంద్ర

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేద విద్యార్థికి బంగారు భవిష్యత్తును కల్పించేలా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నియోజకవర్గం స్థాయి జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధగా విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు సీఎం వైఎస్ జగనన్న ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అమ్మఒడి ద్వారా ఏటా రూ.15 వేలు తల్లుల అకౌంట్లలోకి జమ చేస్తున్నారన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. సమాజం గర్వించేలా విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని సూచించారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్‌లో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదుతోపాటు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యాక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీలు సునీత, నాగేశ్వరరావు, జెడ్పీటీసీ భాస్కర్, ఎంఈఓ గురుప్రసాద్, ఎంఈఓలు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో అనే విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర తెలిపారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఈ యేడాది టెన్త్, ఇంటర్లో ప్రతిభ చాటిన 8 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ప్రతిభావంతులకు మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తో నగదు పురస్కారాలను అందజేశారు. పదోతరగతి విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10, మూడో బహుమతిగా రూ.5 వేలు, ఇంటర్‌లో గ్రూప్ టాపర్‌గా నిలిచిన ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం చాలా కీలకమని, విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఎంపీపీ బీవీ.మాధవి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్, ఎంఈఓలు కుళ్లాయప్ప, జయానాయక్, రవినాయక్, వార్డు కౌన్సిలర్ మెహరున్నీసా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాసులు ఇవ్వాలి

గుంతకల్లుటౌన్: విద్యార్థులకు సకాలంలో బస్ పాసులు ఇవ్వాలని ఏబీవీపీ నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం ఏబీవీపీ నాయకులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. టూటౌన్ సీఐ గణేష్ ఆర్‌టీసీ అధికారులతో చర్చించి విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపడంతో వారు ఆందోళన విరమించారు. ఏబీవీపీ పట్టణ కార్యదర్శి శివరాజ్, సహాయ కార్యదర్శి నాగేంద్ర, రమేష్, హేమంత్, సాయి, గేట్స్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

బుక్కరాయసముద్రం: మండల విద్యాధికారి కార్యాలయంలో పని చేస్తున్న మెసెంజర్లు, హైస్కూళ్లలో పని చేస్తున్న క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్లు, సీఆర్‌పీ, కంప్యూటర్ ఆపరేటర్లను క్రమబద్ధీకరణ చేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు మాట్లాడుతూ సమగ్రశిక్షలో 2005 నుంచి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మెసెంజర్ నల్లప్ప, విజయ శంకర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: పవిత్ర పుణ్యక్షేత్రమైన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర అభివృద్ధిలో భాగంగా కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయాలని భక్తుల వినతి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎం స్పందించి సీఎండీఎఫ్(చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్) ద్వారా కల్యాణ మండప నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధికి బాటలు



మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ హరి

గుంతకల్లు: నైపుణ్య శిక్షణతో ఉపాధికి బాటలు వేసుకోవాలని ఎస్ఎస్‌జీఎస్ కరెస్పాండెంట్ కేసీ హరికుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఎంఎస్ ఆఫీస్(కంప్యూటర్ కోర్స్)పై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజులు పాటు నిర్వహించే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ గోపాల్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్రధాన శిక్షకుడు నాగప్ప, కళాశాల కోఆర్డినేటర్ బాలగంగాధర్ తిలక్, సీనియర్ ఆధ్యాపకులు సురేష్‌బాబు, చంద్రశేఖర్, ఎస్ఎస్ఎస్ పీఓ బీ.కృష్ణయ్య పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: మండల కేంద్రంలో ఈ నెల 20 నుంచి చేపడుతున్న జన చైతన్య యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండల కేంద్రంలోని 5 సచివాలయాల పరిధిలో పార్టీల కతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందేటట్లు చూడాలన్నారు. గ్రామాల్లో త్వరలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామని, అధికారులు ముందస్తుగా ఆయా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేటట్లు చూడాలని తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణకు సూచించారు. జన చైతన్య యాత్రను నిర్వహించేటప్పుడు సర్పంచుతో పాటు వార్డు మెంబర్లు పాల్గొనేటట్లు చూడాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వర్గ విభేదాలను విడనాడి ప్రతి ఒక్కరూ పనిచేయాలని నాయకులకు సూచించారు. ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, నాయకులు శ్రీరాములు, చౌదరి, నాగేష్, రషీద్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శివ ప్రసాద్, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి




పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

శింగనమల: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. తరిమెల గ్రామంలో జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధా, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. క్రీడలు శారీరకంగా, మానసికంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, జయసుధ, వైఎస్సార్‌సీపీ నేత తరిమెల రంగారెడ్డి, సర్పంచ్ ఓబిలేసు, రమేష్, ఎంపీటీసీ రమేష్ , సునీత, నాయకులు గోకుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి కుటుంబానికి నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికి మాత్రమే పథకాలు అందేవన్నారు. అప్పటి ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కోల్పోవడంతోనే రాష్ట్ర ప్రజలు జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. ప్రతిపక్షనాయకుడి హోదాలో జగనన్న ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఎలాంటి సిఫారసు లేకుండా పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి, ఎంపీటీసీ మేకల సరోజ, సర్పంచు ఓబులమ్మ, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి సీనియర్ నాయకులు ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్ రెడ్డి, స్థానిక నేతలు జనార్దన రెడ్డి, నాగిరెడ్డి, బండారు ప్రకాష్, డీలర్ లక్ష్మినారాయణ, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తాడిపత్రి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డులోని నంద్యాల రోడ్డు వేపకాయల మిల్లు వీధిలో గురువారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలు పున ః ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కింద పాఠ్య, నోట్ పుస్తకాలు, టై, బెల్ట్, షూ, అందిస్తున్నామన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన పథకాలతో పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారన్నారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ రంగనాథరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీరంగయ్య, కేశవరెడ్డి, టీకె ఫయాజ్, రామకృష్ణ, కిట్టు, వేణు, గడ్డం గణేష్, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి



భూ హక్కు పత్రాలను రైతులకు అందిస్తున్న తహసీల్దార్ సుమతి

యల్లనూరు: మండలంలోని నిట్టూరు, ఆరవేడు, కాచర్లకుంట గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ సుమతి తెలిపారు. గురువారం జంగంపల్లి గ్రామంలో రైతులతో తహసీల్దార్ సమావేశమయ్యారు. అర్హత ఉన్న రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు లేకుండా సర్వే చేపట్టాలన్నారు. రైతులు తమ పొలాల్లో హద్దులు చూపించి సహకరించాలన్నారు. మండల సర్వేయర్ షర్వాని, వీఆర్వోలు రేణుక, గురుమూర్తి, శ్రీనివాసులు, గ్రామ వార్డు సర్వేయర్లు సాయి తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుత్తి రూరల్: వాతావరణంలో మార్పుల కారణంగా పశువులకు వ్యాధులు సంక్రమించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్.ప్రదీప్ కృష్ణ రైతులకు సూచించారు. గురువారం తొండపాడులో రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్.ప్రదీప్ కృష్ణ మాట్లాడుతూ తొలకరి వర్షాలకు మొలిచే లేత గడ్డి పశువులకు ప్రమాద కరమన్నారు. పశు యజమానులకు కల్తీలేని పాల ఉత్పత్తి, పశు బీమా, దాణామృతం పోషక విలువలు, పొదుగు వ్యాధి లక్షణాలను వివరించారు. ఏహెచ్ఏ స్వరూపారాణి, రిలయన్స్ ఫౌండేషన్ పీఎం ప్రకాష్, జిల్లా ప్రతినిధి గిరిబాబు, గోపాలమిత్ర అల్లూరి, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష తప్పనిసరి

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని అనంతపురం మట్టి పరీక్ష ప్రయోగశాల ఏడీ పుష్పలత పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏఏ ఎరువులు వాడాలో ముందే తెలుసుకోవచ్చొన్నారు. అనంతరం రైతుల పొలాల్లో మట్టిని సేకరించి అనంతపురం పరిశోధనా స్థానానికి పంపించారు.

ప్రయాణికుల భద్రతే ధ్యేయం

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రత తమ ధ్యేయమని సీనియర్ డీఎస్ఓ బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం సేఫ్టీ విభాగం విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ లెవల్ క్రాసింగ్ అవేర్‌నెస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు–కల్లూరు రైలు మార్గంలోని లెవల్ క్రాసింగ్స్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెవల్ క్రాసింగ్ గేట్లు వేసినప్పుడు గేట్‌కిందకు దూరి వెళ్లడం చాలా ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ గేట్లు తెరిచిన తర్వాత రాకపోకలు సాగించాలని విజ్ఞప్తి చేశారు.

వికసించిన మే పుష్పాలు



గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధిలో నివాసముండే అజయ్‌కుమార్ ఇంటి పెరట్లో గురువారం మే పుష్పాలు వికసించాయి. చాలా అరుదుగా మే పుష్పాలు వికసిస్తాయి. వాటిని చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకించారు.

..ఆ శిశువు మృతి

- నిర్ధారించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దవడుగూరు : స్థానిక మెయిన్ బజార్‌లోని ఒక ఇంటిలో నివాసం ఉంటున్న మహిళకు ఇటీవల శిశువు జన్మించింది. అయితే శిశువు కనబడకపోవడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై గురువారం సాక్షిలో 'శిశువు ఎక్కడ?' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్ఐ శ్రీనివాసులు, ప్రాథమిక వైద్యాధికారి శ్రీనివాసబాబు ఉదయం సిబ్బందితో కలిసి బాలింత ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ నెల 12న రాత్రి పాప ఏడుస్తుంటే దగ్గరలోని ఆర్ఎంపీ వద్ద చూపించామని, ఆయన ఇచ్చిన సిరప్ వేయగా శిశువు కొద్దిసేపటి తర్వాత మరణించిందని, మృతదేహాన్ని పూడ్చిపెట్టామని తల్లిదండ్రులు చెప్పారు. అయితే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ సమయంలో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని, శిశువు మృతి చెందడం ఏంటని వైద్యాధికారి వారిని ప్రశ్నించారు. చివరకు శిశువు తల్లిదండ్రులను వెంట బెట్టుకుని శిశువు మృతదేహాన్ని పూడ్చిన ప్రాంతానికి వెళ్లి నిర్ధారించారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్ : స్థానిక 27వ వార్డులోని సుగుణ లాడ్జ్ వీధిలో శుక్రవారం ఉదయం 7: 30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. అలాగే సాయంత్రం 4 గంటలకు పెద్దపప్పూరు మండలం రామకోటి, షేక్‌పల్లిలో కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

గడ్డివామి దగ్ధం

నార్పల: చామలూరు గ్రామంలో గురువారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు..గ్రామానికి చెందిన నాగేష్ అనే రైతు తన ఇంటి వద్ద గడ్డివామి వేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గడ్డివామిలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. ఘటనలో దాదాపు రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పుట్లూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఈ నెల 11న ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలైన విషయం విదితమే. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కేశవరెడ్డి(70) అనంతపురంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పెన్షనర్స్ అసోసియేషన్‌కు వితరణ

తాడిపత్రి టౌన్: స్థానిక టీచర్ కాలనీలో పెన్షనర్స్ భవనంలో గురువారం పట్టణానికి చెందిన కత్తి నారాయణరెడ్డి పెన్షనర్స్ అసోసియేషన్‌కు రూ.10 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి సభ్యులు వీరారెడ్డి, ఆదినారాయణస్వామి, వెంకట్రామయ్య, అశ్వర్థరెడ్డి, సత్యప్రసాద్‌రెడ్డి, చక్రపాణి, హనుమంతరెడ్డి, పెద్దయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గుత్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం హాస్టల్ సమస్యలపై తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రాయల్ సర్కిల్, ఆర్ఎస్‌లోని పత్తి కొండ రోడ్డు, మెయిన్ బజారులో గురువారం ఎస్ఐ శ్రీనివాసులు నేతృత్వంలో పోలీసులు ప్రజల సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా దిశ యాప్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

జంగిల్ క్లియరెన్స్

గుత్తి: పట్టణంలోని 21వ వార్డులో గురువారం వార్డు కౌన్సిలర్ వాల్మీకి శివ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ శివారులో పెరిగిన కంప చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. స్పాట్ డెలివరీ ట్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'జన భాగీదారీ'

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, చంద్రప్రియనగర్‌లో మహాలక్ష్మి, సుందరయ్య కాలనీలో పార్వతి, గుత్తిలోని సుంకులమ్మ(సీపీఐ కాలనీ)లో కృష్ణవేణి ఆధ్వర్యంలో గురువారం జన భాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ డిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడుల్లో ఉండాలన్నదే కార్యక్రమం ఉద్దేశమన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: ఎంగిలిబండ క్రాస్ వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిపత్రికి చెందిన దూద్‌వలి గుంతకల్లు నుంచి బైక్‌పై వస్తుండగా ఎంగిలిబండ బస్టాప్ వద్ద కారు వేగంగా వచ్చి ఢీకొంది. గాయపడిన దూద్‌వలిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తి రూరల్: కరిడికొండలో గురువారం ప్రమాదవశాత్తు కర్రలు తలపై పడి బేల్దారికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే బేల్దారి నూతన గృహంలో పనులు చేస్తుండగా పై నున్న సారవ కట్టెలు ఒక్కసారిగా అతడి మీద పడ్డాయి. ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.